క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో వలంటీర్ల పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులకు వివరాలు తెలుపుతూ మొత్తం 32 ఖాళీలు ఉన్నాయన్నారు. మండలంలో చోడవరం, పెదపులిపాక గ్రామాల్లో చెరొకటి, గోసాలలో రెండు ఖాళీలు ఉన్నాయన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం 28 ఖాళీలు ఉన్నాయని అందులో కానూరు ఐదు, పోరంకి ఏడు, తాడిగడప నాలుగు, యనమలకుదురులో 12 చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయొచ్చని, 19న ఇంటర్వ్యూలు నిర్వహించి వెంటనే నియామక పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నున్న(విజయవాడరూరల్): గాలిపటాలు ఎగరవేసేవారు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేని ప్రాంతాల్లో ఎగరవేయాలని నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పిల్లల వద్ద పెద్దలు తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

పరిశుభ్రంగా ఉండాలి

గన్నవరం రూరల్: ప్రజలందరూ పరిశుభ్రత పాటించాలని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ సూచించారు. శుక్రవారం డ్రైడే పురస్కరించుకుని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. మాదలవారిగూడెంలో సచివాలయం కార్యదర్శి కె.రాజశేఖర్, వీఆర్వో కొండలరావు, ఏఎన్‌ఎం మేరీగ్రేస్, ఆశాలు సైడ్ డ్రెయిన్లు బాగుచేయించారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన



రామవరప్పాడు: మధ్యాహ్న భోజనంలో మెను, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జవహర్ బాలభవన్ డైరెక్టర్ సాయిరాం అన్నారు. రూరల్ మండలం రామవరప్పాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం సాయిరాం పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆటస్థలం, పాఠశాల వసతులను పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు, పుస్తకాలు, బ్యాగులు అందరికీ అందాయా అన్న పలు విషయాలను పాఠశాల హెచ్‌ఎం తాయారును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఏఎంఓ బట్టు సురేష్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి నైనవరపు జగదీశ్వరి పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఫ్రిజ్ వితరణ



పెనమలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రవాస భారతీయ వైద్యుడు ఫ్రిజ్ వితరణగా ఇచ్చారు. ప్రవాస భారతీయ వైద్యుడు పెనమలూరు నివాసి డాక్టర్ కిలారు రామమోహన్‌రావు సీమ దంపతులు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మందులు భద్రపరుచుకోవడానికి రూ.50 వేలు విలువ చేసే ఫ్రిజ్ విరాళంగా ఇచ్చారు. మండల వైద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ రామమోహన్‌రావు స్వగ్రామానికి వైద్య సేవలు అందించడమే కాకుండా మందులు, వైద్య పరికరాలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటివారిపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్న వేధింపులతో అత్తింటి వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన మల్లిపూడి సూర్యకుమారి కొన్నేళ్ల క్రితం రాజమండ్రికి చెందిన వెంకట రమేష్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. భర్త ఎలక్ట్రీషియన్. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు చాలలేదంటూ భర్తతో పాటు మామ వీరబాబు, బావ దుర్గాప్రసాద్ వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వారు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో గోదా కల్యాణం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో శనివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండంలో ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఉప కార్యనిర్వహణాధికారి వెంకటయ్య, సూపరింటెండెంట్ రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరుగంటలకు వేదోక్తంగా కల్యాణక్రతువు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

ఘనంగా పేరంటాలమ్మ ఉత్సవాలు



అమ్మవార్లకు భోగి పళ్లు పోస్తున్న అర్చకులు



ఆలయంలో అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. భోగి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ తెల్లవారుజాము నుంచే అమ్మవార్ల దర్శనం ప్రారంభమైంది. ఉదయం నుంచి భక్తులు వాహనపూజలు చేయిస్తూ, మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయంలోని శ్రీ మహాలక్ష్మి, శ్రీ వెంకమ్మ, శ్రీ వినుకొండ వెంకమ్మ విగ్రహాలకు భోగి పండ్లను భక్తిశ్రద్ధలతో పోశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ మకర సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆలయం సమీపంలోని సర్వీసు రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరం వద్ద వాహన పూజలకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.



పుట్టింటి నుంచి సారె తీసుకొస్తున్న భక్తులు

ఘనంగా ‘వీఆర్‌కేఎం’ గోల్డెన్ జూబ్లీ

ఉయ్యూరు: వీఆర్‌కేఎం పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. వేడుకలను కేసీపీ సంస్థల జీఎం ఫ్లోరెన్స్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకటరావు ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరవేసుకుని ఉపాధ్యాయులతో ఆత్మీయతను పంచుకుని ఉత్సాహంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ముఖాముఖి నిర్వహించుకుని ఒకరినొకరు పరిచయం చేసుకుని మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పూర్వ విద్యార్థికి రూ 50 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కేసీపీ యూనిట్ హెడ్ వైఎస్‌ఆర్ దాస్, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వీవీ రాజేష్‌కుమార్, కార్యదర్శి పినమాల నాగకుమార్, ప్రతినిధులు శ్రీనివాసరావు, సునీల్, రమేష్, హుస్సేన్, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ ప్రమాద బీమా అర్హులకు వర్తింపజేయాలి

విజయవాడరూరల్: కేంద్ర ప్రభుత్వం భారత్ ఆయుష్మాన్ భవ పథకంలోని ప్రమాద బీమాను అర్హులకు వర్తింపజేయాలని మండల ఈఓఆర్డీ బీవీ శేషగిరిరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో గ్రేడు 5 కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఏఎన్‌ఎంలకు ఆయుష్మాన్ భవ ప్రమాద బీమా పథకంపై సమావేశం జరిగింది. ఈఓఆర్డీ మాట్లాడుతూ మండలంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలు 57వేలు ఉండగా వాటిలో 20వేల కుటుంబాలను మాత్రమే ఈ పథకంలో నమోదు చేశారన్నారు. మిగిలిన వారికి వర్తించడానికి వారిలో అవగాహన కల్గించాలన్నారు.

ప్రమాదవ శాత్తు మరణిస్తే 5లక్షల బీమా వర్తిస్తోందన్నారు. గాయపడిన వారికి నిబంధన ప్రకారం చెల్లింపులుంటాయన్నారు. మండలంలో ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.

కారిడార్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పటమట(విజయవాడతూర్పు): ఎయిర్‌పోర్టు కారిడార్ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు జాతీయరహదారి వెంబడి నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్టు కారిడార్ పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పనులను పరిశీలించి మెటీరియల్ త్వరగా ఏర్పాటు చేసుకుని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కారిడార్‌కు టైల్స్ అంచులు పగిలిపోవడం గమనించిన ఆయన అధికారులపై మండిపడ్డారు. నాణ్యతలో రాజీలేకుండా చర్యలు తీసుకోవాలని, టైల్స్ పగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు ఈఈ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు కారిడార్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గన్నవరం నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన పోటీల్లో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన 38 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోటీల్లో సినియర్స్ విభాగంలో అత్కూరు జట్టు విజేతగా నిలవగా, నరసన్నపాలెం, వీరవల్లి గ్రామాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. జూనియర్స్ విభాగంలో వీరవల్లి జట్టు ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, వేలేరు, బల్లిపర్రు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. విజేతలకు బాపులపాడు పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు, వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత, వైఎస్సార్ సీపీ నాయకుడు కొడెబోయిన బాబి చేతుల మీదగా ట్రోఫీ, జ్ఞాపికలను అందజేశారు. మూడేళ్లుగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు బొల్లెద్దు భాగ్యరాజు, ఎస్‌ఆర్‌ఐ కసుకుర్తి రాజాను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.అశోక్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేత గూడవల్లి రత్నసుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కంకిపాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. సంప్రదాయ పిండి వంటలు ఆరగించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ శ్రీనివాస్, పీకా ఇమ్మానుయేలు, నాయకులు కొణతం మాధవరావు, పాలడుగు వెంకట కృష్ణమోహన్, ఇంటూరు నాగేశ్వరరావు, అక్కినేని సత్యవంతు, ఏ.శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు కబడ్డీ, షటిల్, ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ నేత కూరేటి శ్రీకాంత్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా యువతకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎస్టీయూ నేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ 1983 టెన్త్ బ్యాచ్, నాటి ఉపాధ్యాయులు

ఉంగుటూరు: ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ 1983 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. 40 సంవత్సరాల తర్వాత పూర్వ అధ్యాపకులతో తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలోని వేదికపై ఆత్మీయ సమ్మేళనం జరిగింది. విద్యనేర్పిన గురువులను, ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శాస్త్రి, శేషుకుమారి, రత్నకుమారి, డి.రాధాకృష్ణ మూర్తి, పూర్వ విద్యా ర్థుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసు

పెనమలూరు: కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కోడి పందేలు నిర్వహించే యనమలకుదురు గ్రామం సుగాలీ కాలనీకి చెందిన శ్రీనివాసనాయక్, వినోద్‌కుమార్, శివపార్వతీనగర్‌కు చెందిన రెడ్డిశివ, పెనమలూరు గ్రామానికి చెందిన మీసాల హరికృష్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వెలమర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కార్యదర్శిగా బాపులపాడు మండలం రేమల్లేకు చెందిన వెలమర్తి రవిబాబు ఎన్నికయ్యారు. ఈ నెల 12న గుడ్లవల్లేరులో జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయనను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన్ను సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, భగీరధి, మండల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు అభినందించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు

గుణదల(విజయవాడ తూర్పు): మాదక ద్రవ్యాల కారణంగా యువత జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని నగర అడ్మిన్ డీసీపీ ఎం సత్తిబాబు అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాల పై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అలవాట్లను బట్టి మన అభివృద్ధి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

మద్యం, గంజాయి, డ్రగ్స్ వలన శారీరక అనారోగ్యంతో పాటు, మానసిక రుగ్మతలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాలకు బానిసలైన వారి జీవితాలు అంధకారంగా మారాయని పేర్కొన్నారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తికిపై కేసు

పెనమలూరు: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించి మరో పెళ్లికి సిద్ధపడిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన ప్రశాంతి నిజామాబాద్‌కు చెందిన బంధువు ఎ.ప్రవీణ్ మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. ప్రవీణ్ ఇప్పుడు మరో యువతితో పెళ్లికి సిద్ధపడ్డాడు. దీంతో ప్రశాంతి నిలదీయటంతో అతను పెళ్లికి నిరాకరించాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లక్ష్మీతిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం మండల దీక్ష పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 5న జరగనున్న శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా గత నెల 18 నుంచి మండల దీక్ష ప్రారంభించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ తర్వాత అమ్మవారికి పొంగళ్లను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కి పూజలు చేశారు. సాయంత్రం తిరుపతమ్మ మాతృ మండలి సభ్యులు శ్రీలలితా సహస్రనామ పారాయణం, మండల దీక్ష పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, స్థానికులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ

కేపీ రెడ్డియ్యకు నివాళి

ఉయ్యూరు: బందరు మాజీ ఎంపీ కొలుసు పెద్ద రెడ్డియ్య యాదవ్ అంతిమయాత్ర అశ్రునయనాలతో సాగింది. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన రెడ్డియ్య భౌతికకాయాన్ని విజయవాడ నుంచి స్వగ్రామమైన కారకంపాడుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ర్యాలీతో తరలించారు. ఉయ్యూరు ప్రధాన సెంటరులో రెడ్డయ్య చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు, నాయకులు శ్రీనివాసరావు, జంపాన రవి తదితరులు నివాళులర్పించారు.



ఉయ్యూరులో రెడ్డియ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కందిపప్పు నాణ్యత పరిశీలన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జేసీ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న కందిపప్పు నాణ్యతను సంబంధిత శాఖ అధికారులు పరిశీలించారు. అరండల్‌పేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం కందిపప్పు ఉడికించి చూశారు.

విశ్వాసంతో అద్భుతాలు సృష్టించవచ్చు

ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి విశ్వాస జీవితం చాలా గొప్పదని, విశ్వాసంతో అద్భుతాలు సృష్టించవచ్చని మేరిమాత కపూచిన్ ప్రావెన్షియల్ ఫాదర్ కరుణాకర్ కాసు అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత తంబి సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. ఉదయం 7గంటలకు తంబి కళావేదిక వద్ద సమష్టి దివ్య పూజా బలిని సమర్పించారు. ప్రధాన గురువులు విశ్వాస జీవితంపై బోధించారు. పూజానంతరం గురువులు, సిస్టర్స్, విశ్వాసుల సమక్షంలో ఫాదర్ కరుణాకర్ పునీతుల మార్గాన్ని ఆశీర్వదించి ప్రారంభించారు. ఈ మార్గంలో వివిధ పునీతుల స్వరూపాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం కొత్తగా అభిషేకించిన గురువులు ఫాదర్లు ఏసుపాదం, కుమార్ రాజు, రమేష్, అస్సిన్, సమంత్ సమష్టి దివ్యపూజా బలిని కొనియాడారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మానికొండ యలమర్తి రాజు నిర్వహణలో ధనవంతుడు బీద లాజరు అను క్రైస్తవ నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ సుధాకర్ లారెన్స్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఫాదర్లు, సిస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.



తంబి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

వేగంగా సేవలందించడానికి సెల్‌ఫోన్ల పంపిణీ



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సెల్‌ఫోన్లు అందుకున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

గన్నవరం: నియోజకవర్గ ప్రజలకు వేగంగా సేవలందించడానికి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సొంత నిధులతో అత్యాధునిక సెల్‌ఫోన్లను అందించడానికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముందుకువచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తైన తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలోని 65 మంది సిబ్బందికి, 163 మంది వలంటీర్లకు తొలి విడతగా సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నేతల చేతుల మీదుగా 228 మందికి అందజేశారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు విజయవంతంగా పని చేస్తున్నాయని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వినియోగిస్తున్న సెల్‌ఫోన్లు నెట్‌వర్క్, మెమరీ, ఇంటర్నెట్ సమస్యలతో వేగంగా సేవలు అందించలేకపోతున్నారని చెప్పారు. ఈ సమస్యను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు ఎమ్మెల్యేకు విన్నవించారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే నియోజకవర్గ వ్యాప్తంగా 663 మంది సచివాలయ సిబ్బందికి, 1,781 మంది వలంటీర్ల అందించనున్నారని చెప్పారు. ఇక ప్రజలకు వేగంగా సేవలందించడానికి ఫోన్లు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, వడ్లమూడి సరోజిని, చెన్ను ప్రసన్నకుమారి, నగేష్, జెడ్పీటీసీలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, కాకర్లమూడి సువర్ణరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గొసాని పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

పాతపాడు(విజయవాడరూరల్): వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల బృందం శుక్రవారం పాతపాడు గ్రామంలో రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మెడికల్ అధికారి డాక్టర్ మాధురి, వైద్య బృందం గ్రామంలో నల్లమోతు రామకోటమ్మ, కొమరవల్లి భవానీ అనే పేషెంట్ల వద్దకెళ్లి వైద్య సేవలు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్యులను పంపి సేవలను అందించడం ఎంతో ఆనందాన్ని కల్గిస్తోందని వ్యాధి పీడితులు అన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలని, మనోధైర్యం అవసరమని డాక్టర్ మాధురి సూచించారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీనికనుగుణంగా వైద్యసిబ్బంది పని చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం 104 వ్యాను వద్ద గ్రామస్తులకు జనరల్ వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ డీఎంఆర్ రత్నం, నాగేశ్వరావు, ఏఎన్‌ఎం నవత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. నున్న, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.



పాతపాడులో రామకోటమ్మకు చికిత్స చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి